నమస్తే తెలంగాణ
వికారాబాద్
11 | హైదరాబాద్, శనివారం 9 మార్చి 2024 | VIKARABAD

## ట్యాంకర్ల ద్వారా పంటపొలాలకు నీరు..



ఇబ్రహీంపట్నంరూరల్, మార్చి 8 : భూగర్భజలాలు తగ్గడం, బోర్లు ఎండిపోవడం, విద్యుత్ సరఫరా సరిగా లేకపోవడంతో అన్నదాతలు తల్లడిల్లిపోతున్నారు. ఎండిపోతున్న పంటలను కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. పంటలను ఎండబెట్టుకోలేక కొందరు రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం సమీపంలోని రాయపోల్-లింగంపల్లి గ్రామాల మధ్యన ఓ రైతు కొత్తిమీర సాగుకు ఇలా ట్యాంకర్ ద్వారా నీరందిస్తుండగా 'నమస్తేతెలంగాణ' క్లిక్‌మనిపించింది.



తాండూరు : అంతారంతండాలోని భూ కైలాస్‌లో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



శంకర్‌పల్లి : చందిప్పలో..



# ముక్కంటి.. నినుగంటి..

- ఉమ్మడి జిల్లాలో ఘనంగా మహాశివ రాత్రి వేడుకలు
- భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు
- భక్తిశ్రద్ధలతో పూజలు, రాత్రంతా జాగారం చేసిన ప్రజలు
- స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు

*ఓంకారం ప్రతిధ్వనించగా.. శివనామం మార్మోగగా.. మహాశివరాత్రి వేడుకలు శుక్రవారం అంబరాన్నంటాయి. భక్తుల భజనలు, కోలాటాలు, మంగళ వాయిద్యాలతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నది. శివాలయాలు భక్తజన ప్రవాహాన్ని తలపించాయి. ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. అన్ని ఆలయాల్లో ఉదయం నుంచే భక్తులు క్యూలో నిల్చొని స్వామివారిని దర్శించుకున్నారు. దీక్షలు, పుణ్య స్నానాలు, రుద్రాభిషేకాలతో భక్తులు నీలకంఠుడిని పూజించారు. రాత్రంతా జాగారం చేసి స్వామివారి కృపకు పాత్రులయ్యారు.*

*-న్యూస్ నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ*



మహేశ్వరంలోని ఆలయానికి వచ్చిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి, చిత్రంలో కిక్కిరిసిన భక్తులు

# ఉత్తీర్ణతే లక్ష్యంగా..

- 'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు పక్కా ప్లాన్‌తో ముందుకెళ్తున్న విద్యాశాఖ
- డిసెంబర్ నుంచే ప్రారంభమైన ప్రత్యేక తరగతులు
- ఈనెల 18 నుంచి పదో తరగతి పరీక్షలు
- వికారాబాద్ జిల్లాలో 13,412 మంది విద్యార్థులు
- సీసీ కెమెరాల నిఘాలో ఎగ్జామ్స్..
- జిల్లాలో 80 పరీక్షా కేంద్రాలు

వికారాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ) : పదోతరగతి పరీక్షలు సమీపిస్తుండడంతో ఈ ఏడాది మెరుగైన ఫలితాలను సాధించేందుకు జిల్లా విద్యాశాఖ పక్కా ప్లాన్‌తో ముందుకెళ్తున్నది. ఈనెల 18 నుంచే టెన్త్ పరీక్షలు ప్రారంభం కానుండడంతో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో డిసెంబర్ నుంచే విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సిలబస్‌ను జనవరిలోనే పూర్తిచేసి అప్పటి నుంచే రివిజన్ చేస్తున్నారు. కాగా గతేడాది 59.82 శాతం మాత్రమే ఉత్తీర్ణులు కాగా, ఈ ఏడాది మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు. అంతేకాకుండా ఉత్తీర్ణతలో వెనుకబడిన ప్రభుత్వ బడులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. గతేడాది ప్రశ్నాపత్రాల లీకేజీ ఘటన నేపథ్యంలో ఈ ఏడాది పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. టెన్త్ పరీక్షలు సీసీ కెమెరాల నిఘా నీడలో జరుగనున్నాయి. ఈ ఏడాది 80 శాతానికిపైగా ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా విద్యాశాఖ కసరత్తు చేస్తున్నది.

### ప్రత్యేక తరగతులు...

ఈ ఏడాది టెన్త్‌లో మెరుగైన ఫలితాలను సాధించేందుకు విద్యాశాఖ అధికారులు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో డిసెంబర్ నుంచే ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నా రు. జిల్లాలోని కొన్ని బడుల్లో నవంబర్ నుంచే ప్రారంభం కాగా.. మిగిలిన అన్ని స్కూళ్లలో డిసెంబర్ నుంచి షురూ అయ్యాయి. ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 4.00 నుంచి 5.30 గంటల వరకు కొనసాగుతు న్నాయి. ఒక్కో రోజు ఒక్కో సబ్జెక్టుపై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యా ర్థుల కు ఉన్న సందేహాలను సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయుడు నివృత్తి చేస్తున్నారు. అంతేకాకుండా ప్రతినెలా స్పెషల్ టెస్టులను నిర్వహిస్తూ వార్షిక పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం టెన్త్ విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు జరుగుతున్నాయి.

జిల్లాలో ఈ ఏడాది పదోతరగతి పరీక్షలకు 13,412 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వారిలో బాలికలు-6477 మంది, బాలురు 6883 మంది ఉ న్నారు. ప్రైవేట్ స్కూళ్ల నుంచి 2,848 మంది.. మిగతా 10,564 మంది విద్యార్థులు ప్రభుత్వ, ఎయిడెడ్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఎస్టీ ఆశ్రమ స్కూళ్లతో పాటు కేజీబీవీ, జడ్పీ తదితర పాఠశాలల నుంచి హాజరు కానున్నారు. కాగా జిల్లాలో పరీక్షల నిర్వహణకు 80 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో 1073 ప్రభుత్వ పాఠశాలలుండగా, 162 జడ్పీహెచ్‌ఎస్‌లున్నాయి.

### జిల్లాలో 80 పరీక్షా కేంద్రాలు..

టెన్త్ ప్రశ్నాపత్రాల లీకేజీ ఘటనలు జరుగకుండా అధికారులు అప్రమత్తమ య్యారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు



చేయడంతోపాటు అదనంగా ఇన్విజిలేటర్లనూ నియమిస్తున్నారు. జిల్లాలోని 80 పరీక్షా కేంద్రాల్లో 700 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. అంతేకాకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వ హించేందుకు ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్, 80 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు.

### ఏర్పాట్లు పూర్తి..

**- రేణుకాదేవి, వికారాబాద్ డీఈవో**



జిల్లాలో పదోతరగతి పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. 80 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు మాస్ కాపీయింగ్‌కు విద్యార్థులు పాల్ప డకుండా ఉండేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నాం. ఈ ఏడాది వార్షిక పరీక్షల్లో విద్యార్థులు 80 శాతానికి పైగా ఉత్తీర్ణత సాధించేందుకు డిసెంబర్ నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహించి.. ప్రతినెలా స్పెషల్ టెస్టులు రాయిస్తూ సన్నద్ధం చేస్తున్నాం.

# పహాణీ నకలు కావాలంటే లంచం ఇవ్వాల్సిందే!

**కొందుర్గు తహసీల్ కార్యాలయంలో ఆర్మీ జవాన్‌కీ తప్పని వేధింపులు**

**ప్రైవేటు ఉద్యోగితో కలిసి రికార్డు అసిస్టెంట్ బాలరాజ్ లంచం అడిగారని ఆరోపణ**

**రూ.40వేల మామూళ్ల పర్వంపై వైరల్ అవుతున్న వీడియో**

రంగారెడ్డి, మార్చి 8(నమస్తే తెలంగాణ)/ షాద్‌నగర్ : జిల్లాలోని కొందుర్గు తహసీల్ ఆఫీసులో ఆర్వోఆర్, పహాణీ నకలుకు రూ.40వేలు డిమాండ్ చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. రికార్డు అసిస్టెంట్ బాలరాజ్ మరో ప్రైవేటు ఉద్యోగితో కలిసి లంచం డిమాండ్ చేశాడంటూ ఓ ఆర్మీ ఉద్యోగి సామాజిక మాధ్యమాల్లో పెట్టిన పోస్టు కలకలాన్ని రేపుతున్నది. తన పొలానికి సంబంధించిన ఆర్వోఆర్, పహాణీ నకలు కోసం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోగా.. లంచం డిమాండ్ చేశారంటూ కొందుర్గు మండలంలోని విశ్వనాథ్‌పూర్ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ అశోక్ రెడ్డి సెల్ఫీ వీడియోతోపాటు పేటీఎంలో పంపిన డబ్బులకు సంబంధించి స్క్రీన్‌షాట్స్‌ను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశాడు. సార్.. అడుగుతున్నందునే డబ్బులు అడుగుతున్నామని లంచం డిమాండ్ చేశారని రికార్డు అసిస్టెంట్ బాలరాజ్, ప్రైవేటు ఉద్యోగి హేమంత్‌ల అవినీతి బాగోతాన్ని ఆర్మీ జవాన్ వీడియోలో వివరించారు. తహసీల్దార్‌తో తానే స్వయంగా ఎంతోకొంత మాట్లాడుకుంటానని చెప్పినప్పటికీ కలవనీయ లేదన్నారు. మూడు నాలుగు రోజుల తర్వాత రమ్మంటే తహసీల్ ఆఫీసుకు వెళ్లినట్లు తెలిపారు. సార్.. అడుగుతున్నాడని..డబ్బులు ఇవ్వకుంటే పని కాదని వేధించారని ఆవేదన వ్యక్తం చేశారు. తొలుత రూ.10వేలు క్యాష్ ఇచ్చానని, ఆ తర్వాత ఆన్‌లైన్‌లో కొంత డబ్బు ఇచ్చానని.. అయినప్పటికీ మొత్తం డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారన్నారు. నెల రోజుల సెలవుపై వచ్చానని, కశ్మీర్ వెళ్లాల్సి ఉందని చెప్పినా కనికరం చూపలేదన్నారు. డాక్యుమెంట్లు దొరికాయని, మొత్తం డబ్బులు ఇస్తేనే..ప్రింట్ తీసి సార్‌తో సంతకం పెట్టి ఇస్తామని కరాఖండిగా చెప్పారని వాపోయారు. కొందుర్గు తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డు సెక్షన్‌లో ఘోరంగా డబ్బులు తింటున్నారని పేర్కొన్నారు. హేమంత్ అనే వ్యక్తికి ఎటువంటి అపాయింట్‌మెంట్ లేదని, ప్రతి పనికీ ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నాడని ఆరోపించారు. కొందుర్గు రెవెన్యూ డిపార్ట్‌మెంట్ ఇలా తయారైందేమిటి! అని ఓ ప్రభుత్వ ఉద్యోగిగా షాక్ అవుతున్నట్లు పేర్కొన్నారు. ఇక్కడి నుంచి కశ్మీర్‌కు వెళ్లిపోయి డ్యూటీలో చేరాక కొందుర్గు తహసీల్ ఆఫీసులో అవినీతిపై చిత్రీకరించిన వీడియోను, సెల్ఫీ వీడియోతోపాటు స్క్రీన్ షాట్స్‌ను ఆర్మీ ఉద్యోగి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసి అవినీతి బాగోతాన్ని గుట్టు రట్టు చేశారు. రెవెన్యూ అవినీతి బాగోతానికి సంబంధించిన ఈ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నది. దీనిపై వివరణ కోసం తహసీల్దార్, ఆర్డీవోలను ఫోన్‌లో సంప్రదించగా.. స్పందించలేదు.





# మిల్లర్లకు అందలం.. అక్రమాలకు అవకాశం

- 2022-23 యాసంగి కోటానే పూర్తికాని వైనం
- తాజాగా.. 2023-24 వానకాల సీజన్ ధాన్యం మిల్లర్లకు కేటాయింపు
- అక్రమాలకు ఊతమిచ్చేలా పౌరసరఫరాల సంస్థ నిర్ణయం
- సీజన్లు గడిచిపోతున్నా.. సీఎంఆర్ సేకరణలో జాప్యం

రంగారెడ్డి, మార్చి 8(నమస్తే తెలంగాణ): సీజన్లు గడిచిపోతున్నా.. రంగారెడ్డి జిల్లాలో మిల్లర్ల నుంచి కస్టమ్స్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) మాత్రం వెనక్కి రావడం లేదు. 2022-23 యాసంగికి సంబంధించి సీఎంఆర్ గడువు ముగిసింది. అయినా.. ఇంకా 48 శాతం బియ్యం మిల్లర్ల వద్దే ఉండిపోయాయి. తాజాగా 2023-24 వానకాలానికి సంబంధించిన ధాన్యాన్ని సైతం మిల్లులకు సీఎంఆర్ కింద కేటాయించారు. గత కోటా పూర్తికాకపోయినప్పటికీ మళ్లీ మిల్లర్లకు కేటాయింపులు జరుపడం చర్చనీయాంశంగా మారింది. ఒక సీజన్ బియ్యాన్ని వాయిదా వేస్తూ.. మరొక సీజన్‌లో వచ్చే ధాన్యాన్ని మిల్లింగ్ చేసేందుకు పౌరసరఫరాల సంస్థ నిర్ణయించడం అక్రమాలకు ఊతమిచ్చినట్లేనన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

### గడువు ముగిసినా..

పౌర సరఫరాల సంస్థ నిబంధనల మేరకు ప్రతి సంవత్సరం సీజన్‌కు సంబంధించి ఆరు నెలల్లో మిల్లులకు కేటాయించిన ధాన్యానికి బియ్యం సేకరణ చేయాల్సి ఉంటుంది. అయితే కొంతమంది రైస్ మిల్లర్ల అలసత్వంతో ప్రతి సీజన్‌లోనూ సీఎంఆర్ ప్రక్రియలో జాప్యం జరుగుతున్నది. 2022-23 యాసంగికి సంబంధించిన ధాన్యాన్ని సైతం మరాడించడంలో మిల్లర్ల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. సీఎంఆర్‌పై కేంద్రం ఇప్పటివరకు ఐదారుసార్లు గడువు పొడిగించింది. చివరగా.. ఫిబ్రవరి 29 వరకు గడువు పొడిగించిన కేంద్రం మరోసారి గడువు పెంచే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. అయినప్పటికీ రైస్ మిల్లర్లు అప్పగించాల్సిన బియ్యంలో ఇప్పటివరకు కేవలం 52 శాతం మాత్రమే ఇచ్చారు. ఈ సీజన్‌లో 28,156 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల శాఖ 12 మిల్లులకు అప్పగించింది. ఇందుకు బదులుగా మిల్లర్లు 13,434 మెట్రిక్ టన్నుల సీఎంఆర్‌ను ఎఫ్‌సీఐకి అప్పగించాల్సి ఉన్నది. ఇప్పటివరకు 14,721(52 శాతం) మెట్రిక్ టన్నులు మాత్రమే ఇవ్వగా.. ఇంకా 48 శాతం బియ్యం మిల్లర్ల వద్దే ఉన్నది. మిల్లర్లతో తరచూ సమావేశాలు నిర్వహించడంతోపాటు పౌరసరఫరాల శాఖ అధికారులు మిల్లుల్లో తనిఖీలు జరిపి ఒత్తిడి తెచ్చినప్పటికీ ఫలితం లేదు. మరో నెల రోజులు గడువు పొడిగించినా.. ఆలోపు పూర్తి మిల్లింగ్ సాధ్యమయ్యే పరిస్థితులు కనిపించడం లేదు.

### వానకాల ధాన్యమూ కేటాయింపు..

గత యాసంగి కోటా పూర్తికానప్పటికీ.. 2023-24 వానకాలం బియ్యం సేకరణకు భారత ఆహార సంస్థ పచ్చజెండా ఊపింది. ఈ మేరకు పౌర సరఫరాల సంస్థ జిల్లాలోని 13 మిల్లులకు 9,879 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అప్పగించింది. క్వింటాలుకు 67 కిలోల చొప్పున 6,618 మెట్రిక్ టన్నుల సీఎంఆర్‌ను మిల్లర్లు అప్పగించాల్సి ఉండగా అధికారులు సంబంధిత మిల్లింగ్‌పై దృష్టి పెట్టారు. ఎఫ్‌సీఐకి అందజేయాల్సిన ఒక సీజన్‌లోని బియ్యాన్ని వాయిదా వేస్తూ మరొక సీజన్‌లో వచ్చే ధాన్యం మిల్లింగ్ చేసి ఇస్తున్నారు. అధికారులు ఒత్తిడి చేసిన సందర్భంలో కొందరు మిల్లర్లు బ్లాక్ మార్కెట్‌కు తరలించే రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి సర్దుబాటు చేస్తున్నారన్న ఆరోపణలు సైతం ఉన్నాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో యాసంగి లక్ష్యం పూర్తికానప్పటికీ.. మళ్లీ అదే మిల్లర్లకు వానకాలం ధాన్యాన్ని అప్పగిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎఫ్‌సీఐ తీరు.. అక్రమాలకు ఊతమిచ్చినట్లేనన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతున్నది.